ఏ రూపంబున దీని గెల్తు

నిట మీ దే వేల్పు చింతింతు

# తీరని సమస్య

"జయ"

"ఏమండోయి! ప్రయాణమౌతున్నట్లున్నారు. కాస్త రేషను ఇక్కడ పడేసి మరీ వెళ్ళండి!'

అని లోపలనుండి ఒక నోటీసు జారీఅయింది నేను రవంత వెంటరాడే స్కూలుకు వెడదామని సర్దుకుంటూంటే. ఈ నోటీసు అమలు జరగడానికి రెండు వరాలు కావాలి. ఒకటి, నెలలో ఏరోజున లక్ష్మీ ప్రసన్నం కలుగుతుందో తెలియని బడిపంతులుకు వారం మొదట చేతిలో డబ్బుండాలి. రెండవది దేవుడు వరమిచ్చినా పూజారి అనుగ్రహం కలగాలన్నట్లు రేషను షాపు తెరచివున్నా అందులో ఆ వాడు అపర బ్రహ్మస్వరూపం సాక్షాత్కరించి ఉండటం. ఈ రెండూ సమకూడటం సాధారణంగా జరగదు. దానికితోడు మా బడి, రేషనుషాపు ఒకేమారు తెరువబడి ఒకేమారు మూయబడతాయి. ఇందులో ఏ ఒక్కపని జరగాలన్నా రెండో దానికి నీళ్లు వదులుకోవలసిందే గదా. ఈలాంటి చిక్కులున్నాయని మనస్సులో అనుకుంటూ,

'సరే మన యింటిప్రక్క బసవన్న చేతికిచ్చి మన కార్డుకూడా పంపించు. నాకు బడివేళ అయింది' అని సమాధానం యిచ్చాను గంభీరంగా.

ఆ సలహా మీరివ్వలేకనికాదు డబ్బు పారెయ్యండి నా మొఖాన' అని మళ్లా సమాధానం వచ్చింది.

ఇక్కడే 'కార్యేషుమంత్రీ' సార్థకమవాలి. నీకు ఉపాయాలు నేను చెప్పాలా? అంటూ గుమ్మంమెట్లు దిగుతున్నాను.

'ఎన్నాళ్ళు చూచినా నా తిప్పలు నాకు తప్పవు' అంటూ ఏదో గొణుగుడు వినపడింది. వినిపించుకోనట్లుగా పాఠశాలకు దారితీశాను. దారిలో పిల్లలను తోడుకొనిపోయే బాధ్యత ఒకటి ఉంది. కొంతదూరం నడిచి ఒక ఇంటి ముందు ఆగి ఆ గృహస్థుతో,

'ఏమండీ! మీ అబ్బాయి బొత్తిగా బడికి రావటం లేదు?

'అదేమిటండీ వాడు రోజూ టైముకు సరిగ్గా వెళ్ళి సరిగ్గా వస్తూంటేను. మా వాడి సంగతి మీరు ఏమీ చూస్తున్నట్లు లేదే? పిల్లాడు క్లాసులో ఉంటున్నదీ లేనిదీ చూచుకోకపోతే ఎలాగండీ? అని ఆయన ధోరణి నామీదకే ఎదురు తిరిగింది. కొంత సముదాయించుకొని,

'నేను నిజమే చెపుతున్నాను. వాడు ఈ విధంగా మిమ్మలనూ, నన్నూ కూడా దగాచేస్తున్నాడన్నమాట. కాస్త భయంచెప్పి బడికి పంపించండి!

అయితే నేను భయంచెపుతే మీరెందుకండీ? కేవలం జీతం పుచ్చుకోవడానికా?'

ఈ ప్రశ్న తరచుగా అధికారులూ వేస్తూంటారు. కార్యవాదిని గదా అని ఇంకా ఓర్మి వహించి.

'బడిలో ఉన్న రెండు ఘడియలు మా పెత్తనంగాని తరవాత మేమెవరమో' అని అంటూండగా వాడి జతగాడు మరో కుర్రాడు ఎదురుపడ్డాడు.

'ఏమిరా? వీరి అబ్బాయి, ప్రభాకరం, నీతో జతగా వస్తాండేవాడు వాడేడీ?

'మేష్టారూ! వాడు రోజూ పుస్తకాలతో వచ్చి మా యింటిప్రక్కన ఉన్నవారి అబ్బాయితో కలసి ఆడుకుని మళ్ళీ గంటకొట్టగానే యింటికి పోతున్నాడండి!

'అరి! భడవా? ఒక్కసారైనా చెప్పలేదేం? చూచారాండి రహస్యం బయటపడింది. మీరు

కొంత జాగ్రత్త తీసుకుని రోజూ బడికి పంపించండి. ఇదివరకులా గాదు! బడికి సరిగా పంపక పోతే జుల్మానాలు వేస్తున్నారు.'

'చెడు సహవాసాలు! ఏం చెప్పమన్నారు. రేపటినుండి పంపిస్తాను గాని. మరేదో ఆ మాట రాకుండా మాత్రం చూడండి' అని, అయన నిష్క్రమించాడు. బ్రతుకుజీవుడా అని బయట పడ్డాను. పుణ్యానికిపోతే పాపం ఎదురౌతుం దంటారు. ఇదేననుకొన్నాను. మరో రెండడుగులు వేసి ఒక అసామీ కనబడితే,

'వెంకటస్వామీ! కుర్రాడిని బడికి పంపించడం లేదే'మన్నాను.

'చిత్తం! ఆడని కూలిచేసి తెస్తూంటేనే పిల్లాజల్లా తోటి కటకటలాడి పోతున్నామండి. ఆ షావుకారుగారు నెలకు రెండు పుంజీలు ఇస్తానంటే, ఏదో కొంత వేడినీళ్ళకు చన్నీళ్లు పోయంగందా అన్న ఆశతోటి ఈ వారంరోజులనుండి పిల్లాడిని ఆరి కొట్టు దగ్గరకు తోలేస్తున్నానండి.'

నాగుండె ఝల్లుమన్నది. ఆర్థికస్థితి నీ పెరుగుదునుకూడా. పోనీ అతన్ని ప్రోత్సాహపరుద్దామన్న ఉద్దేశంతో.

'సరే కాని, వాడికి కాస్త అక్షరం ముక్క వస్తూంటే మళ్ళా మానిపించేస్తే ఎలాగ వెంకటస్వామి?'

'తమరన్నది నిజమేనండి. ముందు పొట్ట గడవడమే లేకుంటే చదువెక్కడండి. గుడ్డా గోచీ చూసి-టైముకి భోజనం పెట్టి బడికి పంపించాలి గదండి. డబ్బున్న మా రాజులకు కుదురుతుందిగాని మా కెలాగండి. అయినా మా పిల్లలు చదువుకొని ఉద్యోగాలు చెయ్యాలా ఊళ్లేలాలా బాబు. రెక్కాడితేనేగాని డొక్కాడదు గదా! ఏదో ఆ కొట్టుమీదుంటే కొంత పనైనా అబ్బుతుందనండి.'

'అయ్యయ్యో! మీకు చదువు విలువ తెలియక అలా అనుకుంటున్నారు. చదువంటూ వస్తే గదా ఏపనికైనాను. బడికి పంపించు సర్కారు వారివల్ల మాటొస్తుంది' అన్నాను. ఇంకేమీ సమాధానం చెప్పలేక'

'అదెలాగో తమరే కాపాడాలి. బక్కోళ్ళం బాబు' అంటూ అతను వెళ్ళిపోయేడు. శ్రామికవర్గంలో 10-12 సంవత్సరాలు పిల్లలు ఏదో పనిచేసి ఒక పావు తెచ్చి సహాయపడక పోతే వాళ్ళకు జీవనమాత్ర సాగదు. అతనికి సమస్య మాకు పిల్లలు బడికిరాని సమస్య అని అనుకుంటూ నడుస్తూంటే ఒక అసామీ ఎదురై

'ఏమండీ? పంతులుగారూ! ఈ నోటీసు ఏమిటండీ' అన్నాడు.

'మీ పిల్లవాడు ఆ మధ్యను బళ్లోకి సరిగా రాకుండా మానేసేడుకదూ అందుకని నోటీసు.'

'మరి యిప్పుడు వస్తున్నాడు గదాండి'

'జనవరినుండి అయిన మూడు నెలలలోను 20 రోజులవరకు బడి మానేసేడు. అందుచేత నన్నమాట.'

'అయితే ఎప్పుడో ఆరునెలల క్రిందట జరిగిన దానికి యిప్పుడా నోటీసులు' పైగా ఆ నోరు మాలి నోట్సు రాకపోతే బతిమాలి తీసుకెళ్లాలి గాని ఈ నోటీసు లేమిటండీ?'

'అది మీ పిల్లాడి చదువు విషయమై శ్రద్ధ వహించమని మీకే హెచ్చరిక.'

'చెప్పే చదువు లేదుగాని ఇకేమిటండి. మా పిల్లోళ్ల చదువుగురించి మాకు తెలియదంటారా?'

'మరి తెలిస్తే ఇదంతా ఎందుకూ? మీరేదో ఉపేక్షచేసి వాడు బడికి వెళుతున్నదీ లేనిదీ చూడరు. మాకు అధికారులవల్ల మాట వస్తుంది. ఎలా చెప్పండి?'

'ఇదిగో పంతులుగారూ! నలుగురు కుర్రాళ్లు బడికివస్తూంటే మీకు కొంత గడుస్తుందని మాకు తెలియదంటారా! కాస్త ఆడాళ్లేదో పనిమీద తిప్పుతారు అంతే. ఇనస్పెక్టరుగారొస్తే పంపించమని చెపుతాలెండి.'

'అయితే ఈ చదువు నాకోసమా? ఇనస్పెక్టరుగారి కోసమా? ఈసారి నోటీసుతో పోయిందిగాని మరోమారు జుల్మానాలు పడతాయి. అది శాసనం.'

'సరేనండి, మాకు మాట రాకండా చూసినప్పుడు, మేంమీకుమాత్రం మాటరాకండా చూడొద్దండీ' అంటూ ఆయన వెళ్ళిపోయాడు ఏదో ఉపకారం చేస్తున్న భావంతో. ఇదొకరకం మాధ్యం. అలికి అన్నం పెట్టుకోవడం ఊరికి ఉపకారమని ఒక సామెత. తెలిసీ తెలియని నరు దెల్ప బ్రహ్మదేవుని వశమూ అని నడుస్తూంటే

మరొకతండ్రి ఎదురై తీక్షణంగా నామీద చూపులు విసిరి ఆవేశంతో,

'ఏమోయ్, పంతులూ! జున్నూనా వేయించి మాయింటికి జప్తుకు పంపుతావటయ్యా!'

'అదేమిటి సోమన్నా! అలా వుంటావు, నే నెందుకు పంపుతాను.'

'నీవు చెప్పకపోతే మా పిల్ల బడికి రావటం లేదని సర్కారు కెలా తెలిసిందో చెప్పు?'

'మరి బడికి రాకపోతే రానట్లు మేము అధికారులకు తెలియజెయ్యాలి.

'ఇంటిదగ్గిర పురుడొచ్చి ఇంకా నెల కాలేదు. పచ్చిబాలెంతరాలి దగ్గిర పిల్ల లేకపోతే గడవదు గదా. ఇక మా చిక్కులేమీ మీ కక్కర్లేదన్నమాట!'

'పురుడు ఈ నెలలో వచ్చింది కాబోలు. ఆరుమాసాల క్రింద నీకు ఎన్నిమార్లు చెప్పినా పిల్లను బడికి పంపించే శ్రద్ధ పూనకున్నావా మరి. అది గవర్నమెంటు రూలు. దానికి నీవూ నేనూ కూడా బద్ధులం కావలసిందే.'

'మంచి రూలే! చదువు కావాలి మొర్రో అన్న వాళ్ళకి లేదుగాని. మాకే గాబోలు ఈ బలవంతమంతాను. ఇదిగో మళ్ళా దసరా కెల వస్తావో, ఈ పేటలో బడి ఎలా నడుపుతావో చూస్తాను గదూ అంటూ రుసరుస లాడుతూ వెళ్ళిపోయేడు.

మరో గండం గడిచింది. ఎలాగో బడి చేరుకున్నాను. నా గుండెకాయ వలెనే బడిగంట గణగణా మోగింది. బడి ఆవరణలో అడుగు పెట్టానో లేదో,

'మాష్టారూ! వీడు నా పుస్తకాలు లాక్కున్నాడండి!'

'మాష్టారూ! అప్పారావు నన్ను కొట్టాడండి!'

'మాష్టారూ! వీడు నా పలక చితకొట్టాడండి!'

'మాష్టారూ! వీడు నా వీపుమీదుగా దూకేడండి!'

'నిన్న బడి విడిచి పెట్టాక నా పలకపుల్ల తీసికొని మళ్లా ఇవ్వటంలేదండి' ఇత్యాదిగా కేసులు సిద్ధంగా ఉన్నాయి. అందర్నీ కేకలేసి క్లాసుకు పోయి కూర్చోమని, సంతకం చేసివచ్చి నా పీఠం అధిష్ఠించాను.

ఇంతలో గొల్లున ఏడుస్తూన్న కుర్రాడిని వెంటబెట్టుకుని ఒక తల్లి వచ్చి, వడివడిగా ఒక కుర్రాడి దగ్గరకు పోయి,

'ఏమోయ్, పిల్లాడా! ఈ పుస్తకాలు ఇలా చింపేసేవట. ఏమండీ పిల్లలు పుస్తకాలు చింపుకుంటుంటే మీరు మందలించకపోతే ఎలాగండి!'

'అమ్మా! ఇక్కడ నేనుండగానే మీరే ఆ పిల్లాడిని మందలిస్తే ఎలాగ? ఈ తగువు ఎప్పుడు ప్రారంభమయిందో తెలియకుండానే మందలించగలనా తల్లీ. ఆ తగువేమిటో చూస్తాను. మీరు వెళ్ళండి.

'మంచిమేష్టారండి! పిల్లలకి భయం చెప్పకపోతే ఎలాగండి. మీరంటే పిల్లలకు భయమే లేదు. ఇలాగేనా పంతులు పనిచెయ్యడం' అని ఆమెకు తోచిన రెండు ముక్కలు అంటూ నిష్క్రమించింది.

ఒక్కసారి నా తరగతి పిల్లలకేసి చూసి హాజరు గుర్తించుదా మనుకున్నాను. పట్టుమని క్లాసులో పది తలకాయలైనా కనపడటం లేదు. పిల్లలు సరిగా బడికి హాజరుకాని తప్పిదానికి ఉపాధ్యాయుడే బాధ్యుడు ఇదొక దినగండం. అసలు బడిపంతులు బ్రతుకే ఈ తలకాయల లెక్కతో ముడిపెట్టబడి ఉంది. ఇరవై తలకాయలకు లెక్కతగ్గిందా ఒక మేష్టరు గ్రాంటులో కోతపడుతుంది. ఉపాధ్యాయునికి బోధనాశక్తి కన్నా, హాజరు వృద్ధిచేయటం వల్లనే అతని ఉపాధికి రక్షణ ఉంటుంది. ఇదే అతని జీవితరహస్యం. దీనినే వృత్తులలోకెల్ల ఉత్తమమైనదంటారు. సరే మామూలుపాటగా నలుగురు కుర్రాళ్ళను నాలుగు దిశలకు పంపించేను, నేను పిలచినదికాక.

'రాఘవులు పొలంలోకి అన్నం పట్టుకవెళ్లేడటండి. ఈపూట బడికి రాడట.'

'పాపారావు ఆసుపత్రికి మందుకెళ్ళేడటండి మధ్యాహ్నం పంపుతామన్నారండి.'

'అచ్చయ్య రేవుకొట్టు కెళ్ళాడటండి.'

'వెంకయ్యమ్మ తల్లి కూలికెళ్ళిందట. చంటిపిల్లని చూస్తూందమన్నాదటండి. అందుకు రాదటండి.'

'రత్నమాల జడ వేసుకుంటోందండి-పంపిస్తానన్నారు.'

అని రకరకాలుగా సమాధానాలు వచ్చేయి. ఇందులో ఒకటీ కాదనేది లేదు. ఒకళ్ళిద్దరు అల్లరిపిల్లలు అమాయికంగా బర్డోకి వస్తున్నారు. ఒక దీర్ఘనిశ్వాసంపుచ్చి- 'భగవాన్! నన్ను బడి పంతులుగా ఎందుకు పుట్టించావ్? ఈ బడి మందికి చదువు చెప్పడ మొక్కటే నా బాధ్యత అయివుంటే ఎంత హాయిగా ఉండును! ఈ గందరగోళంలో బుర్ర వేడెక్కి ఇక పాఠమేమని చెప్పను. దీనికి తోడు అధికారుల హాతాత్పరీక్షలొకటి. సీనియరు జూనియర్. అటెండెన్సు ఆఫీసర్లు, ఇంకా ఇటీవల ప్రభుత్వ సిఫార్సుపైన విద్యాభిలాషులైన రెవిన్యూ శాఖ అధికారేతర ఉద్యోగులు, ఎవరైనా ఎప్పుడైనా సరే పరీక్షించవచ్చు. ఎయిడెడు స్కూళ్ళు ప్రైవేటు దుకాణాలు గనుక వారు బాధ్యతారహితంగా ఉండకుండా ఏర్పాటైన రక్షణలు ఇవన్నీను. 'ఏ రూపంబున దీని గెల్తు-నిటమీ దేవేల్పు చింతింతు' నన్న అవస్థలో బడ్డాను సూర్యరథ గమనంలాగ ఈ విధంగానే కాలం దొర్లిపోతుంది.

సరే వచ్చినవాళ్ళతోనే ఏదో కాలక్షేపం చేదామని బోర్డుమీద లెక్కలు వ్రాస్తున్నాను.

'హెడ్మాష్టరుగారు రమ్మన్నారండి' అని ఒక కుర్రాడు కబురట్టుకొచ్చాడు. ఎందుకోనని వెళ్లేను.

'చూడండి. మన గ్రామంలో నిర్బంధ విద్య ప్రవేశపెట్టినది లగాయతు ఈ 3 సంవత్సరాల లోను ప్రతి క్వార్టరుకు ఎంతమంది బడిలో చేరారో, ఇంకా ఎంతమంది అసలే బడిలోచేరని వాళ్ళున్నారో, వారిలో హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, షెడ్యూలు తరగతివారు, బాలురు బాలికలు తరగతివారీగా లెక్కలు కావాలి' అన్నారు.

'చిత్తం! ఈ లెక్క ఒక్కరోజులో అవుతుం దాండి?'

'ఒక్కరోజా! సాయంకాలానికి పూర్తిచేసి ఆఫీసుకు పంపించాలి. అర్జంటు.'

'కుర్రాళ్ళకు నాలుగు లెక్కలు చెప్పి వస్తా ండి.'

'బాగానే ఉందండోయి. ముందు ఈ సంజాయిషీ చూస్తారా? మీ పిల్లల గొడవేనా? వీలు కాదు. ఇది వ్రాసి మరీ వెళ్ళండి.'

'చిత్తం!'

నా సహోపాధ్యాయులతో సహా ఆ మడుగులో పడిపోయాను. కాలానికి దాక్షిణ్యా భావం ఎక్కడా లేదు. ఇంతలో బడి గంట కొట్టింది, పిల్లలకు చర విడింది. కేరింతలు కొట్టుకుంటూ ఇళ్ళకుపోయారు. గడియారం 12 గంటలుకూడా కొట్టింది. పని తేలలేదు. లెక్క ఒక పద్మవ్యూహం లాంటిది. అందులో చొరబడితే బయటకువచ్చే ఉపాయం దొరకదు. తక్కినపని మధ్యాహ్నం పూర్తిచేదా మనుకున్నాం. గృహోన్ముఖుల మైనాం. రేపను సంగతి తలపుకు వచ్చింది. ఏమైందో నని కుంటూ ఇల్లు చేరుకున్నాను. చంటికుర్రాడు కాళ్ళ కడ్డ పడితే ఎత్తుకుని, వంటయింటిలో ఏదో రభస హావిడిగా ఉండటం గ్రహించి,

'ఏమైనా పనిజరిగిందా?' అన్నాను మెల్లిగా మా గృహలక్ష్మితో.

'ఆ జరగకేం. అయ్యవారికి ఆటంక మేమున్నాది. అన్నిపనులూ జరిగేయి. మీకేం. మీరెళ్ళి కుర్చీలో కూర్చుని కథలు, కబుర్లు చెప్పి పిల్లలతో ఆటలాడుకుని వస్తారు.'

'ఆ కథలు కబుర్లు మాత్రం చెప్పనీలుందా? ముందు లెక్కలు తేలాలి. సరే దానికేం. పండా కాయా?'

'ఏముంది! ఎక్కడికైనా అప్పుకు వెళ్ళే రోజులా? పాపం మన ఇంటివెనక వెంకన్న కాపు భార్య ఆతగాడికి తెలియకుండా రెండు శేర్ల బియ్యం పంపించింది. లేకపోతే ఈపూట పస్తుండవలసి వచ్చేదే.'

'భగవంతుడు ఏదో దారిచూపిస్తాడు. ఆవిడ మంచి ఇల్లాలే!'

'మీ వేదాంతానికేంగాని జీతం రాగానే రెండురూపాయిలూ ముందుగా ఆమెకు ఇచ్చెయ్యాలి. బాగుండదు.'

'ఆఁ. అన్యాయం! రెండుశేర్లు రెండురూపాయలా? బాగానే ఉంది ఉపకారం.'

'అయ్యో!ఆవిడ సమయానికాదుకుంటే అలాగంటారే?'

'కాల వైపరీత్యం-కానీ.'